వర్షా భావాన్ని తట్టుకునేలా సాగు చేపట్టండి

జగదేవపూర్ గ్రామసభలో వ్యవసాయాధికారి వసంతరావు, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ పిలుపు

రైతులు ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ చర్యలపై దృష్టి పెట్టాలి

సిద్దిపేట,(జగదేవపూర్) జూలై 24 (వుదయం ప్రతినిధి)

పసిఫిక్ మహాసముద్రంలో వేడి గాలుల (ఎల్‌నినో) ప్రభావం వల్ల ఈ ఏడాది ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వసంతరావు, గ్రామ సర్పంచ్ పసగట్ల శ్రీనివాస్ గౌడ్ సూచించారు. శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన ఈ వాతావరణ ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నీటి సంరక్షణ చర్యలపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. వరి నాట్లకు బదులుగా విత్తనాలు నేరుగా చల్లే (ఎద) పద్ధతిని పాటించాలని, తేలిక రకం మరియు తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలను ఎంచుకోవాలని కోరారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయలు మరియు గుజ్జు పామాయిల్ సాగు వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. వానాకాలం పంటల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడితే భూసారం పెరుగుతుందని తెలిపారు. ఎరువులను అక్రమాలకు తావులేకుండా నూతన సాంకేతిక యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేస్తామన్నారు. రైతులు తమ పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్చ గణేష్, పంచాయతీ కార్యదర్శి విద్యా వికాస్ రెడ్డి, పశు వైద్యురాలు డాక్టర్ శ్వేత, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జూలై 24 (వుదయం ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూమైనారిటీ విద్యార్థినీలకు ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 5 సీట్లు,ఎంపీసీ లో 5 సీట్లు, ఉన్నాయన్నారు. ద్వీతీయ సంవత్సరం ఎంపీసీలో 2 సీట్లు,క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థినీలకు ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ లో 1 సీటు, ఎంపీసీలో 1 సీటు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, ఒకే రకపు దుస్తులు, వైద్య సదుపాయం అందిస్తున్నామని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల తో బోధన, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీలు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో నేరుగా కల్వకుర్తి మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను సందర్శించాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం చరవాణి నెంబర్ 7207998974 ను సంప్రదించాలని తెలిపారు.

ఓగిపూర్ గ్రామంలో ఘనంగా 'జలమహోత్సవం'

– ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే మా లక్ష్యం: సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి

తాండూర్ జులై 24 వుదయం ప్రతినిధి

గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని గ్రామ సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఓగిపూర్ గ్రామంలో □జలమహోత్సవం□ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రజాప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి నీటి వినియోగం, సురక్షిత తాగునీటి సరఫరాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నారాయణ,ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి అండగా 'చిరునవ్వుల కానుక'

కేటీఆర్ జన్మదినం సందర్భంగా మాదాసు శ్రీనివాస్ చేయూత

గజ్వేల్, జూలై 24 (వుదయం ప్రతినిధి

)మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినం సందర్భంగా 'చిరునవ్వుల కానుక' (గిఫ్ట్ ఏ స్మైల్) కింద బాసర ఆర్జీయూకేటీ (ఐఐఐటీ) సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని కుమ్మరి శ్రీజకు గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన దినసరి కూలీల కుమార్తె శ్రీజ, పదవ తరగతిలో 562 మార్కులు సాధించి బాసర ఐఐఐటీలో ప్రవేశం పొందింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు ఆటంకం కలగకూడదని, ఉపాధ్యాయుడు పులిరాజు సూచన మేరకు మాదాసు శ్రీనివాస్ స్పందించారు. కేటీఆర్ పిలుపు ఇచ్చిన స్ఫూర్తితో శ్రీజకు కావలసిన రుసుము, పుస్తకాలు, దుస్తులతో పాటు ఆమె ఆర్జీయూకేటీ చదువు పూర్తయ్యే వరకు అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని ప్రకటించారు. తన చదువుకు అండగా నిలిచినందుకు శ్రీజ దాతకు కృతజ్ఞతలు తెలుపుతూ, కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి నర్సింలు, మాజీ సర్పంచ్ బాపు రెడ్డి, ఉపాధ్యాయుడు పులిరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి విడత ఉద్యోగ నైపుణ్య శిక్షణ పూర్తి

గజ్వేల్, జూలై 24 (వుదయం ప్రతినిధి)

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాచార్యులు (ప్రిన్సిపాల్) ఆచార్య అనిత అబ్రహం సహకారంతో, మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ మరియు కళాశాల ఉద్యోగ అవకాశాల విభాగాలు సంయుక్తంగా చేపట్టిన 12 రోజుల నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఉన్నత స్థాయి గణన సాంకేతికత (అడ్వాన్స్డ్ ఎక్సెల్) మొదటి విడత శిక్షణ శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాల విభాగం సమన్వయకర్త డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ, విద్యార్థినులు తరగతి గది బోధనతో పాటు గణక యంత్రశాల (కంప్యూటర్ ల్యాబ్)లో స్వయంగా శిక్షణ పొంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. శనివారం (జూలై 25) నుండి రెండవ విడతగా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంశంపై శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ శిక్షణ విద్యార్థినుల్లో నైపుణ్యాలను పెంచి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ప్రాచార్యులు కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి, అంతర్గత నాణ్యత విభాగాధిపతి ఎం.ఎం. లక్ష్మి, శిక్షకురాలు నజీయా బేగం, ప్రతినిధి డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు

కల్వకుర్తి జులై 24 (వుదయం ప్రతినిధి)

:నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఆయన జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం,మాజీ పట్టణ సర్పంచ్ శ్రీశైలం,ముందుగా కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, విశేషంగా హాజరయ్యారు.

ఆగస్టు 3 నాటికి ఓటర్ల డిజిటలైజేషన్ 100%పూర్తి చేయాలి

అర్హులైన ఒక్క ఓటరు కూడా మిగిలిపోకూడదు : కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తూడుకుర్తి గ్రామంలో జరుగుతున్న ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామంలోని 146, 147, 148, 149 పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వారు బూత్‌ల వారీగా నమోదు, డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ నమోదులను సమీక్షించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు.తూడుకుర్తి గ్రామ పరిధిలో మొత్తం 5,419 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 4,668 మంది వివరాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఇంకా 781 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఆర్డీవో అర్చన పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు వెల్లడించారు.144వ పోలింగ్ కేంద్రంలో 1,059 మందిలో 887 మంది, 145లో 1,223 మందిలో 965 మంది, 146లో 870 మందిలో 824 మంది, 147లో 909 మందిలో 744 మంది, 148లో 641 మందిలో 564 మంది, 149లో 717 మందిలో 654 మంది వివరాలు నమోదయ్యాయి. డిజిటలైజేషన్ పనులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ఆగస్టు 3వ తేదీలోపు ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని, ఇంటింటికీ వెళ్లి పెండింగ్ వివరాలు సేకరించాలని స్పష్టం చేశారు.డిజిటలైజేషన్‌లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో నాగర్ కర్నూల్ ఆర్డీవో అర్చన, తాహసిల్దార్ తబితా రాణి, డీటీ కిరణ్ కుమార్, బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలకు చేరువ చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రత్యేక వైద్య సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసర ఖర్చు చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (GGH)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి (రామగుండం) జూలై-24 (వుదయం ప్రతినిధి)

ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న చికిత్సా సౌకర్యాలు, వైద్యుల సేవల అందుబాటు, మౌలిక వసతులను పరిశీలించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం అనేక ప్రత్యేక వైద్య సేవలు అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులో ఉన్నప్పటికీ వాటిపై ప్రజలకు తగిన అవగాహన లేకపోవడం వల్ల ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అనవసరంగా అధిక వ్యయం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తున్న అన్ని ప్రత్యేక వైద్య సేవల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులు సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంచుకుని అందుబాటులో ఉన్న సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రత్యేక వైద్య విభాగానికి సంబంధించిన సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, చికిత్సల వివరాలను ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ ప్రత్యేక వైద్య విభాగాలను సందర్శించి, అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు.*న్యూరో సర్జరీ విభాగాన్ని* పరిశీలించిన కలెక్టర్ వెన్నెముక సమస్యలు, మెడ సంబంధిత వ్యాధులు, తలకు గాయాలైన రోగులకు చికిత్స అందిస్తున్న విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యూరో సర్జన్ ప్రతి *బుధవారం, శుక్రవారం* రోగులకు సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. *ఫిజియోథెరపీ విభాగాన్ని* సందర్శించి ప్రమాదాలు, పక్షవాతం, కీళ్ల నొప్పులు, శస్త్రచికిత్సల అనంతర పునరావాస సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు.*2డీ ఎకో సేవలను* పరిశీలించిన కలెక్టర్ గుండె సంబంధిత పరీక్షలు *సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు* అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు.*ఏటీఎఫ్ (Addiction Treatment Facility) కేంద్రాన్ని* పరిశీలించిన కలెక్టర్ మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వ్యసనానికి చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు.*పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో* పిల్లలకు హెర్నియా, తీవ్రమైన కడుపు నొప్పి, తిత్తులు, చీము గడ్డల డ్రైనేజీ వంటి సమస్యలకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. *యూరాలజీ విభాగంలో* ఫిమోసిస్, మూత్రనాళ సమస్యలు, స్టెనోసిస్ వంటి వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. యూరాలజీ నిపుణులు ప్రతి *మంగళవారం, గురువారం* అందుబాటులో ఉంటారని తెలిపారు.*న్యూరో ఫిజీషియన్ సేవలను* కూడా కలెక్టర్ పరిశీలించి, నరాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రతి ప్రత్యేక వైద్య సేవపై ప్రజలకు స్పష్టమైన సమాచారం చేరేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రధాన కేంద్రాలుగా నిలవాలని, నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డా. హిమబిందు సింగ్,సి.ఎస్.ఆర్. ఎం.ఓ.డా. కృపా బాయి,డా.అప్పా రావు, సంబంధిత డాక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

-దివ్యాంగుల పునరావాస కేంద్రానికి దాసరి ఉష ఆర్థిక చేయూత

పెద్దపల్లి, జూలై 24 (వుదయం ప్రతినిధి)

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, ప్రజాసేవతో, సామాజిక బాధ్యతతో జరుపుకోవాలనే సంకల్పంతో ఆమె వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పునరావాస వృత్తి విద్యా కేంద్రం భవన నిర్మాణానికి దాసరి ఉష అందజేసిన ఆర్థిక సహాయాన్ని మీడియా ఇంచార్జ్ అబ్దుల్ మాలిక్,స్ఫూర్తి మానసిక దివ్యాంగుల ఇంచార్జ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ కేటీఆర్ ఆశయాలకు అనుగుణంగానే తమ నాయకురాలు దాసరి ఉష ఈ సేవా కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని కొనియాడారు.ఈ నూతన భవన నిర్మాణం ద్వారా ఎంతో మంది మానసిక దివ్యాంగులకు సరైన పునరావాస సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని,వారు సమాజంలో ఆత్మగౌరవంతో బతికేందుకు ఈ కేంద్రం చక్కటి వేదికవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తమ నాయకురాలు దాసరి ఉష మరియు నియోజకవర్గ ప్రజల పక్షాన కేటీఆర్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజుల రమేష్, ఎండి అజీమ్,ఎండి ఫరీద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జీతో నీట్ విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరు

-బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ వరికిల్ల మల్లేష్

***నీట్ అభ్యర్థుల పోరాటానికి బీఎస్పీ సంపూర్ణ మద్దతు**

పెద్దపల్లి, జూలై 24 (వుదయం ప్రతినిధి)

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జీ చేయడం అత్యంత దుర్మార్గమని,ఇలాంటి చర్యలతో ఉద్యమాలను ఆపలేరని బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ వరికిల్ల మల్లేష్ తీవ్రంగా హెచ్చరించారు. నీట్ అభ్యర్థుల పోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఎస్పీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వరికిల్ల మల్లేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువత,విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.దేశాన్ని విద్యాపరంగా అంధకారంలోకి నెట్టేస్తున్న చేతకాని బీజేపీ ప్రభుత్వం,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే తమ పదవులకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ దేశవ్యాప్త పోరాటానికి,నీట్ విద్యార్థుల డిమాండ్లకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు,మాజీ ముఖ్యమంత్రి,ఎంపీ కుమారి మాయావతి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ క్యాదసి రవిందర్,జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గోపాల్ యాదవ్,కోశాధికారి పులిపాక బొందాలు, జిల్లా కార్యదర్శి నక్క తిరుపతి,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులు బోంకూరి దుర్గయ్య,మంథని ఇంచార్జ్ జనగామ రవి కుమార్,రామగుండం ఇంచార్జ్ జింక ఉదయ్,అధ్యక్షులు జనగామ లింగయ్య,జిల్లా మహిళా కన్వీనర్ కాంపెల్లి అనిత,పెద్దపల్లి అసెంబ్లీ ఉపాధ్యక్షులు బోయిని రంజిత్,ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్,కోశాధికారి మల్లారపు రవిందర్,పెద్దపల్లి నియోజకవర్గ మహిళా కన్వీనర్ కల్వల శోభ,పట్టణ అధ్యక్షురాలు రామిళ్ల శారద,తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ హోల్ ను శుభ్రపరచాలి మురుగు నీటిని తొలగించాలి

కొల్లాపూర్ చౌరస్తాలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ డిమాండ్

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

కొల్లాపూర్ చౌరస్తాలోని మెయిన్ హోల్ ను వెంటనే శుభ్రపరచి మురుగునీటిని తొలగించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ అధికారులను డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన కొల్లాపూర్ చౌరస్తాలోని మెయిన్ హోల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులకు పలుమార్లు విన్నవించినా, ఫోటోలు చూపించినా సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడం వల్ల చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాస్తో కూస్తో నడిచే వ్యాపారం కూడా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల సమస్యలను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే స్పందించి మెయిన్ హోల్ ను శుభ్రపరచి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

బాధితులకు తక్షణ న్యాయం అందించాలి
రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలి
అమ్రాబాద్ సర్కిల్ ఆఫీస్, ఈగలపెంట PS లను తనిఖీ చేసిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం బ్యూరో) :

పోలీస్ స్టేషన్లలో ఎలాంటి కేసులు పెండింగ్ ఉండకూడదని, బాధితులకు తక్షణ న్యాయం అందించాలని, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా అమ్రాబాద్ సర్కిల్ ఆఫీస్ ను, ఈగలపెంట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది విధులను పరిశీలించారు. కార్యాలయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, బాధితులు వచ్చినప్పుడు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి, పారదర్శక విచారణ ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. సకాలంలో సహాయం అందించేలా కింది స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు.స్థానిక రౌడీషీటర్ల వివరాలు అడిగి తెలుసుకుని, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకొని, ఎలాంటి కేసు కూడా పెండింగ్ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, అమ్రాబాద్ సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. సర్కిల్ ఆఫీస్, ఈగలపెంట PS నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు.ఈ తనిఖీలో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, అమ్రాబాద్ సీఐ, సంబంధిత ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన అదనపు కలెక్టర్ చెన్నయ్యను సన్మానించిన టీఎన్జీవో నాయకులు

జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

నాగర్ కర్నూల్ జిల్లాకు నూతనంగా వచ్చిన అదనపు కలెక్టర్ చెన్నయ్యను జిల్లా టీఎన్జీవో నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు బావాండ్ల వెంకటేష్, కార్యదర్శి షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో అదనపు కలెక్టర్ చెన్నయ్యకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా టీఎన్జీవో నాయకులు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగులు అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. పరిపాలన మరింత పటిష్టంగా ఉండేందుకు ఉద్యోగ సంఘాలు కలెక్టరేట్‌కు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఉపాధ్యక్షులు చెన్నకేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాగర్ కర్నూల్ యూనిట్ అధ్యక్షులు నసిరుద్దీన్, కార్యదర్శి సురేష్ కుమార్, మహిళా నాయకులు అలివేలు, అరుణ, రామకృష్ణ, సుదర్శన్, బుగ్గప్ప, నాగయ్య, రాకేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

పీఎం మోడీ రాజీనామా చేయాలి : బిఎస్పీ

నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించిన బహుజన సమాజ్ పార్టీ

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది.శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ చౌరస్తాలో బిఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఇంచార్జ్ సి. కళ్యాణ్, ఉమ్మడి జిల్లా జోన్ ఇంచార్జ్ అంతటి నాగన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ బిఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టినట్లు తెలిపారు.బిజెపి 12 ఏళ్ల పాలనలో 152 పైగా పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని, అయినా కేంద్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని ఆరోపించారు. జూలై 20న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లక్షలాది మంది విద్యార్థులపై లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన నిరసన హక్కును కాలరాయడాన్ని ఖండించారు.పీఎం మోడీ విద్యార్థుల మృతుల కుటుంబాలకు సానుభూతి తెలపకుండా, విద్యార్థులపై అక్రమ కేసులు పెడతామని వీడియో విడుదల చేయడం సరికాదని మండిపడ్డారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని, బాధిత కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, లాఠీచార్జి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మురళి మనోహర్ జోషి, సచిన్ టెండూల్కర్, సల్మాన్ ఖాన్ తదితరులు విద్యార్థులకు మద్దతుగా మాట్లాడుతున్నారని, వీరిని కూడా దేశద్రోహులు అంటారా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మడుపు నాగేష్, జిల్లా కార్యదర్శి బంకల దాస్, కొల్లాపూర్ ఇంచార్జ్ మునిస్వామి, అచ్చంపేట్ ఇంచార్జ్ కృపానందం, కల్వకుర్తి అధ్యక్షులు నీరటి రమేష్, భాస్కర్, అంజి, రాముడు, అర్జున్, వెంకటేష్, బిఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మత్స్యకారుల అభివృద్ధికి డిజిటల్ బాట
మత్స్య సహకార సంఘాలు, SHG స్వయం సహాయక బృందాల అపూర్వ స్పందన
మత్స్య సొసైటీ అధ్యక్షులు: జంగం నాగరాజు

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం బ్యూరో)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం గ్రామీణ మత్స్యకారుల జీవన విధానం, వారి ఆర్థిక ప్రగతికి తొలి ప్రాధాన్యతనిస్తూ నిర్విరామంగా కృషి చేస్తుందని వెన్న చర్ల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు జంగం నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం వెన్న చర్ల గ్రామంలో శుక్రవారం సొసైటీ భవనం నందు మత్స్యకారులను ఉద్దేశించి అధ్యక్ష కార్యదర్శులు జంగం నాగరాజు, జంగం శేఖర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా" ఒకే గుర్తింపు ఒకే వేదిక బహుళ ప్రయోజనాలు "NFDP నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫామ్ ద్వారా మత్స్యకారుల అభివృద్ధికి డిజిటల్ బాట సులభతరంగా అర్థవంతంగా, ఉపయోగకరంగా ఉన్నదని, సొసైటీ లో ఉన్న సభ్యుల తో పాటు సభ్యత్వం లేని వారు కూడా 20 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలలందరు NFDP లో ఎన్రోల్మెంట్ చేసుకోవడానికి అవకాశం ఉన్నదని అన్నారు. మత్స్య సహకార సంఘాలు, SHG స్వయం సహాయక బృందాలు, చేపల ఉత్పత్తిదారులు, విక్రయదారులు, సంస్థలకు మేలు చేకూరుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ గుర్తింపు ద్వారా" రిజిస్ట్రేషన్ అనంతరం ప్రతి మత్స్యకారునికి ప్రభుత్వ గుర్తింపు పొందిన NFDP గుర్తింపు సర్టిఫికెట్ తక్షణమే అందించడం ఉపయోగకరమన్నారు. ప్రతి మత్స్యకారునికి "ఆర్థిక సహాయం బ్యాంకు రుణాలు " బ్యాంకు రుణాలు సులభంగా, సంస్థాగత రుణాలు, మరియు కిసాన్ క్రెడిట్ కార్డ్ లభ్యత కూడ చేకూరాను. అక్సి కల్చర్ బీమా సదుపాయం, ప్రమాద భీమా, సాంకేతిక శిక్షణఅందించడం NFDP యొక్క ప్రయోజనాలను సభ్యులకు సూచించారు. తద్వారా మత్స్యకారుల నుండి అపూర్వమైన స్పందనతో సభ్యులు ఎన్రోల్మెంట్ అధిక సంఖ్యలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు గడ్డి గోపుల సలేశ్వరం, కమిటీ పెద్దలు డబ్బా లింగన్న, పెద్ద మశన్న, గేరినాగులు, డబ్బా పర్వతాలు, మహిళా మత్స్యకారులు బేబీ, ఎల్లమ్మ వెంకటమ్మ, మహిళా సభ్యులు,కమిటీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

యూనిఫాంల తయారీలో రాష్ట్రంలో నాగర్ కర్నూల్ జిల్లా ముందంజ

ఆగస్టు 25లోగా 81,174 మంది విద్యార్థులకు 2 జతల యూనిఫాంల పంపిణీ

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

రాష్ట్రంలో యూనిఫాంల తయారీలో నాగర్ కర్నూల్ జిల్లా ముందంజలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రశంసించారు. జిల్లాలో కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందని, ఇదే స్ఫూర్తితో ఆగస్టు 25లోగా పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సంజయ్ జాజు మాట్లాడారు. విద్యార్థుల ఏకరూప దుస్తుల పంపిణీ, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టింపు పురోగతి, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై సమీక్షించారు.ప్రతి విద్యార్థికి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రెండు జతల యూనిఫాంలు అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా ఆగస్టు 25లోగా పంపిణీ పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాల ద్వారా కుట్టింపు నిర్వహించడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతున్నాయని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 923 ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న 81,174 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఆగస్టు 10లోగా మొదటి జత, ఆగస్టు 25లోగా రెండో జత పంపిణీ పూర్తి చేస్తామన్నారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ నెల 30న అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తామన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేసు, డీఈవో రమేష్ కుమార్, డీపీవో శ్రీరాములు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సొమ్ముకు "మనస్త్రీనిధి" రక్ష

*** పక్కాగా వాయిదాల లెక్క**
*** రుణ చెల్లింపుల సర్దుబాటు వారి చేతిలోనే**
*** డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సాహం**

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం బ్యూరో)

స్వయం సహాయక సంఘాలలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం మహిళలు జీవనోపాధులకు స్త్రీనిధి ద్వారా పొందిన రుణాల చెల్లింపులలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెడుతూ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నమ్మకమైన ,సులభతరమైన డిజిటల్ చెల్లింపు విధానం తో మన స్త్రీ నిధి యాప్ ను తీసుకువచ్చింది. సభ్యురాలు చెల్లించే ప్రతి పైసాకు పక్కా లెక్క కనిపించడం గ్రూపు సభ్యుల రుణ వివరాలు, వారి లావాదేవీలు క్షణాల్లో తెలుసుకునే అవకాశం ఉండడం , గంటలకొద్దీ సమయం ఆదా అవుతుండడం తో ప్రతి సభ్యురాలు యుద్ధప్రాతిపదికన యాప్ ను వినియోగించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు .జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ఇలాజిల్లా పరిధిలో 652 గ్రామసంఘాలలో , 8083 సంఘాలలో, 31609 మంది సభ్యులు స్త్రీనిధి రుణ నిల్వ కలిగి ఉన్నారు . సుమారు 20 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి . స్త్రీనిధి రుణాలు పొందిన సభ్యుల్లో నెలవారీ రుణ వాయిదాలు డిజిటల్ చెల్లింపు విధానం లో జరుపుతున్న సంఘాలు 57 శాతం గా ఉన్నది . మెప్మా పరిధిలోని సంఘాల్లో ఇది 70 శాతం కి చేరువగా ఉండగా , సెర్ప్ పరిధి లో 55శాతం గా ఉంది .నిరక్షరాస్యత కారణం గా గ్రామీణ మహిళా సంఘ సభ్యులు టెక్నాలజీ వినియోగం పై దృష్టి సారించకపోవడం తో సభ్యులు తాము చేస్తున్న రుణ చెల్లింపులపై సమాచారం పొందలేకపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు చెల్లింపు చేస్తున్న మొత్తాలను స్వంత అవసరాలకు వినియోగిస్తున్నట్టు , రుణాలు కూడా పక్కదారి పడుతున్నట్టు, బకాయిలు రోజు రోజుకు పెరిగిపోతున్నట్టు అధికారులు తమ పరిశీలనలో గుర్తించారు . ఈక్రమం లోనే ప్రభుత్వం మహిళలకు వారి డబ్బులకు భరోసా కల్పిస్తూ అక్రమాలకు చెక్ పెట్టె దిశగా మన స్త్రీనిధి యాప్ ను రూపొందించింది . ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం తో చదువు నేర్పే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం , జిల్లా స్థాయిల్లో డిజిటల్ చెల్లింపులపై సీఆర్పి లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి గ్రామ స్థాయిలో వారిచే సంఘ సభ్యులు కు అవగాహనా కార్యక్రమాలకు సిద్ధం చెయ్యడం వంటి కార్యక్రమాల ద్వారా సభ్యులు యాప్ వినియోగంపై వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి . డిసెంబర్ నాటికీ 100శాతం సభ్యులు యాప్ ద్వారా తమ చెల్లింపులు జరిపేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నారు . మన స్త్రీనిధి యాప్ వినియోగం ను జిల్లా , మండల సమాఖ్యల సమావేశాల్లో ప్రత్యేక అజెండాగా కార్యక్రమం రూపొందిస్తున్నారు . మన స్త్రీనిధి యాప్ ఉపయోగాలుమనస్త్రీనిధి యాప్ వినియోగం ద్వారా సభ్యులు తమ వాయిదా డబ్బులు జమ అయ్యాయా లేవా అనేవి చెక్ చేసుకోవచ్చు అలాగే తాము ఉన్నచోటే తమ నెలవారీ చెల్లింపులకు సంబంధించి స్టేట్మెంట్ పొందవచ్చు . సంఘ సభ్యుల రుణ వివరాలు , వారి చెల్లింపు లావాదేవీలు ,సభ్యులు అందరూ క్రమబద్ధమైన చెల్లింపులు జరిపేలా పర్యవేక్షణ జరిపేందుకు యాప్ ఉపయోగపడుతుంది . సభ్యురాలి సమయం ఆదా చేస్తూ ఇంటినుండే స్మార్ట్ ఫోన్ ద్వారా రుణ వాయిదాలు చెల్లింపు జరుపవచ్చు . ఋణం కావాల్సిన సభ్యురాలు యాప్ ద్వారా రుణ దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు . రుణ వాయిదా ల చెల్లింపు ఇలామనస్త్రీనిధి యాప్ ద్వారా రుణాల వాయిదాల చెల్లింపు పై అధికారులు ప్రత్యేక అవగాహనా కల్పిస్తున్నారు . సంబంధిత స్త్రీనిధి మేనేజర్ ద్వారా భ్యురాలు తమ మొబైల్ నెంబర్ ని రిజిస్టర్ చేసుకొని సంఘం తిరిగి చెల్లింపు ప్రత్యక్ష చెల్లింపు యూపీఐ ద్వారా అనే ఆప్షన్ ను ఉపయోగించి చెల్లింపు జరపవచ్చు. చెల్లింపు సర్దుబాటు సభ్యురాలు వారీగా తామే చేసుకునేందుకు అవకాశం ఉండడంతో తమ రుణానికి జరుగుతున్న సర్దుబాటు సంబంధించి పూర్తి వివరాలు సభ్యురాలికి అవగాహన ఉంటుంది. చెల్లింపు జరిగిన రోజే లోన్ వివరాలు అడ్జస్ట్మెంట్ జరిగి అప్డేట్ కావడం తో ఆలస్యం, అధిక వడ్డీ,అక్రమాలు వంటి సమస్యలకు చెక్ పెట్టినట్టు అయ్యింది.అవగాహన కల్పిస్తున్నాం జి.మహేంద్రకుమార్ , స్త్రీనిధి రీజినల్ మేనేజర్ .సంఘ సభ్యులు మనస్త్రీనిది యాప్ పూర్తి స్థాయిలో వినియోగించేలా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పిస్తున్నాము. ఇటీవల జిల్లాస్థాయి ఉన్నత అధికారులు నిర్వహించిన పలు రివ్యూ సమావేశాల్లో కూడా స్పష్టమైన ఆదేశాలు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఇవ్వడం జరిగింది. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం పై నిరంతరం పర్యవేక్షణ జరిపి సభ్యులందరూ మన స్త్రీనిధి యాప్ ద్వారా చెల్లి...

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

రైతులకు శాస్త్రీయ సాగు సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశం

నాగర్ కర్నూల్, జులై 24 (వుదయం ప్రతినిధి) :

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంపై ప్రభావం, భూగర్భ జలాలలభ్యత,నీటిసంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని తేలికగా తీసుకోవద్దని, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిర్ణయాలు తీసుకునేలా మార్గనిర్దేశం చేయాలని చెప్పారు.ధిక నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా పత్తి, కందులు, మినుములు, పెసలు, ఉలవలు, జొన్నలు, సజ్జలు, రాగులు, చిరుధాన్యాలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితో మంచి దిగుబడి ఇవ్వడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు,పంటలబీమా,మార్కెటింగ్ అవకాశాలు, కనీస మద్దతు ధరలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. 'జల ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు దేవ సహాయం, చెన్నయ్యతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.